నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | సోమవారం 13 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిబ్బందికి ఈవీఎం అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఓటేద్దాం రండి..

నేడే పార్లమెంట్ ఎన్నికలు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ఓటింగ్
- కేంద్రాలకు పోలింగ్ సామగ్రి తరలింపు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం

మంచిర్యాల, మే 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు స్వరం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం సాయంత్రంతో ప్రచార పర్వానికి తెరపడిన నేపథ్యంలో.. నేడు(సోమవారం) పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16,50,175 మంది, పెద్దపల్లి సెగ్మెంట్‌లో 15,96,430 మంది ఓటర్లు ఉన్నారు. వీరంగా నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ సామగ్రి, ఈవీఎంలను ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగింటిలో పోలింగ్ రెండు గంటల ముందుగానే పూర్తి కానున్నది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలుసహా మంథని నియోజకవర్గంలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోనూ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మిగిలిన నియోజవర్గాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉండనుంది. నిర్దేశిత సమయంలోపు వచ్చి లైన్‌లో నిలబడిన ఓటర్లందరూ ఓటు వేసేందుకు సమయం ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి ఆదివారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలుసహా నియోజకవర్గ కేంద్రం నుంచి సామగ్రిని, సిబ్బందిని అధికారులు పోలింగ్ నిర్వహించేందుకు వారికి కేటాయించిన కేంద్రాలకు వెళ్లారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో 2,197 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

మంచిర్యాలలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్లేందుకు బస్సుల వద్ద ఉన్న అధికారులు, సిబ్బంది

మంచిర్యాల నుంచి ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న ఉద్యోగి

మంచిర్యాల జిల్లాలో..

నస్పూర్, మే 12 : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్. డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి సందర్శించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. చెన్నూర్ సెగ్మెంట్‌లో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 272 మంది ప్రిసైడింగ్, 272 మంది సహాయ ప్రిసైడింగ్, 544 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 30 మంది సూక్ష్మ పరిశీలకులు, 28 మంది సెక్టార్ అధికారులను నియమించారు. 681 బ్యాలెట్ యూనిట్లు, 227 కంట్రోల్ యూనిట్లు, 227 వీవీ ప్యాట్‌లు కేటాయించి 175 బ్యాలెట్లు, 64 కంట్రోల్ యూనిట్లు, 86 వీవీ ప్యాట్‌లను అదనంగా కేటాయించారు. బెల్లంపల్లి సెగ్మెంట్‌లో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 272 మంది ప్రిసైడింగ్, 272 మంది సహాయ ప్రిసైడింగ్, 544 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 33 మంది సూక్ష్మ పరిశీలకులు, 30 మంది సెక్టార్ అధికారులను నియమించారు. 681 బ్యాలెట్ యూనిట్లు, 227 కంట్రోల్ యూనిట్లు, 227 వీవీ ప్యాట్‌లు కేటాయించి 175 బ్యాలెట్, 62 కంట్రోల్, 87 వీవీ ప్యాట్‌లను అదనంగా కేటాయించారు. మంచిర్యాల సెగ్మెంట్ పరిధిలో 287 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 344 మంది ప్రిసైడింగ్, 344 మంది సహాయ ప్రిసైడింగ్, 688 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 32 మంది సూక్ష్మ పరిశీలకులు, 30 మంది సెక్టార్ అధికారులను నియమించారు. 861 బ్యాలెట్ యూనిట్లు, 287 కంట్రోల్ యూనిట్లు, 287 వీవీ ప్యాట్‌లను కేటాయించి 219 బ్యాలెట్, 82 కంట్రోల్, 110 వీవీ ప్యాట్‌లను అదనంగా కేటాయించారు.

మంచిర్యాలలోని ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 12 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు సిబ్బందికి ఆదివారం పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. మెటీరియల్ తీసుకున్న సిబ్బంది వాహనాల్లో తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. పంపిణీ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ బాలుర గురుకుల పాఠశాల, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 356, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, ర్యాంపు సౌకర్యాలతో పాటు వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గర్భిణులు, వయోవృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 10 మహిళా పోలింగ్ కేంద్రాలు, 2 దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు, 2 యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేందుకు 20 శాతం అదనపు సిబ్బందిని కలుపుకొని మొత్తం 3,244 మందిని నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 676 పోలింగ్ కేంద్రాలకు 91 రూట్లుగా విభజించి 91 మంది రూట్ అధికారులను నియమించామని, 91 మంది సూక్ష్మ పరిశీలకులు, 91 మంది సెక్టార్ అధికారులను కేటాయించనట్లు చెప్పుకొచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఎన్నికల నిర్వహణ కోసం సెక్టార్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను అనుసంధానం చేశామని, రూట్లలో వెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చామని తెలిపారు. జిల్లాలో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఇంటర్నెట్ సౌకర్యం లేని 61 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో సీఆర్పీఎఫ్, పారా మిలిటరీ బలగాలతో పాటు ప్రత్యేక పోలీసు అధికారులు, సిబ్బంది, అటవీ శాఖ సిబ్బందిని విధుల కోసం నియమించినట్లు తెలిపారు. ఈ నెల 13న ముందుగా మాక్ పోల్ నిర్వహించిన అనంతరం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు వచ్చిన వాహనాలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : బస్సులో ఈవీఎంలతో విధులకు వెళ్తున్న సిబ్బంది

పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఓటర్లు..

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళ ఓటర్లు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం ఓటర్లు
చెన్నూర్	96,019	97,752	07	1,93,778
బెల్లంపల్లి	87,283	89,219	12	1,76,514
మంచిర్యాల	1,38,064	1,40,648	26	2,78,738
ధర్మపురి	1,12,442	1,18,338	06	2,30,786
రామగుండం	1,09,826	1,09,870	27	2,19,723
మంథని	1,17,352	1,23,329	18	2,39,699
పెద్దపల్లి	1,26,719	1,30,466	07	2,57,19
మొత్తం	7,87,705	8,08,622	103	15,96,430

ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఓటర్లు..

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళ ఓటర్లు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం ఓటర్లు
సిర్పూర్	1,14,522	1,14,567	12	2,29,101
ఆసిఫాబాద్	1,12,788	1,14,404	16	2,27,208
ఖానాపూర్	1,09,685	1,14,825	13	2,24,523
ఆదిలాబాద్	1,19,848	1,25,283	06	2,45,137
బోథ్	1,02,458	1,08,852	03	2,11,313
నిర్మల్	1,21,991	1,36,304	19	2,58,314
ముథోల్	1,23,583	1,30,978	18	2,54,579
మొత్తం	8,04,875	8,45,213	87	16,50,179

నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

- రామగుండం సీపీ శ్రీనివాస్
- బెల్లంపల్లిలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, మే 12 : పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని తిలక్‌స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మానిటరింగ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సెక్టార్ అధికారులు, పోలింగ్ రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్‌డ్ అధికారుల నడుమ పరికరాలను సదరు లొకేషన్లకు తరలించినట్లు వెల్లడించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ రవి కుమార్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

బెల్లంపల్లి నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తిలక్‌స్టేడియం ఆవరణలో ఎన్నికల సామగ్రిని అధికారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు గంటల్లోపు కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు.

సందీప్‌నగర్‌లో గాలివానకు రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు

గాలివాన బీభత్సం

- పలుచోట్ల విరిగి పడ్డ చెట్లు
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో కూలిన టెంట్లు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/జైనూర్, మే 12 : జిల్లా కేంద్రంతో పాటు ఆసిఫాబాద్ మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రంలో పీటీజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సామగ్రి, ఈవీఎంల పంపిణీ కేంద్రంలో టెంట్లు కూలిపోయాయి. దీంతో అధికారులు పాఠశాల గదుల్లో తల దాచుకున్నారు. వర్షపు నీరు నిలవడంతో ఎన్నికల అధికారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్ వద్ద ఓ రేకుల టేల లేచిపోయి వచ్చి రోడ్డుపై పడింది. ఆ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పొట్టి శ్రీరాములు చౌక్‌లో ఓ చెట్టు విరిగి రోడ్డుపై పడగా, రాకపోకలకు ఆటంకం కలిగింది. సందీప్‌నగర్‌లోని శాంతినికేతన్ పాఠశాల సమీపంలో ఓ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడింది. గుండి గ్రామ వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన వర్షపు నీటికి కొట్టుకుపోయింది. గ్రామస్తుల రాకపోకలు నిలిచిపోయాయి. తుంపల్లి గ్రామానికి చెందిన పొలవేనీ భీరయ్య ఇంటిపై చెట్టు విరిగి పడింది. అదృష్టవశాత్తు భార్యాభర్తలిద్దరూ బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. జైనూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా రెండు గంటలపాటు వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గుండి వాగుపై తెగిన తాత్కాలిక వంతెన

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

- అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- మంచిర్యాల కలెక్టర్ సంతోష్

లంబాడీతండా(కే) పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోశ్

చెన్నూర్/నస్పూర్, మే 12 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి సందర్శించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో సోమవారం జరగనున్న పార్లమెంట్ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. చెన్నూర్ పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు. రిటర్నింగ్ అధికారి చంద్రకళతో ఏర్పాట్లపై చర్చించారు. డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు పోలింగ్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండాలి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌ను అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రస్తుత సమయం అత్యంత కీలకమన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌లో అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, నిరంతరం ఇంటర్నెట్ సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

లంబాడీతండా (కే) పోలింగ్ కేంద్రం పరిశీలన

కాసిపేట, మే 12 : పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేపట మండలంలోని లంబాడీతండా(కే) గ్రామ పంచాయతీలోని మండల పరిషత్ పాఠశాలలోగల పోలింగ్ కేంద్రాన్ని డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి సురేశ్, ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 12 : ఈ నెల 13న 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ (ఎస్టీ) అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసే కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 2 గంటలకోసారి నమోదైన ఓట్ల వివరాలు సేకరించాలని, నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 9 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, 3 గంటలకు, 4 గంటలకు వివరాలు సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇన్‌చార్జిలుగా వ్యవహరించే జిల్లా స్థాయి అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య అధికారి అనిల్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి, ఎన్నికల విభాగం తహసీల్దార్ మధుకర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజ్, నాయబ్ తహసీల్దార్ జితేందర్, ఎన్ఐసీ. ఇన్‌చార్జి శ్రీకాంత్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.